క్లుప్తంగా

మెరుగైన సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ గోపిబాల

జి.సిగడాం: అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శ్రీకాకుళం డివిజనల్ పంచాయతీ అధికారి గోపి బాల అన్నారు. శుక్రవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, పన్నుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం



అన్నప్రసాద వితరణ చేస్తున్న డీఎస్పీ

శ్రీకాకుళం అర్బన్: అన్నదానం మహాదానమని, ఇందులో తాను కూడా భాగం కావడం సంతోషకరమని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానంద అన్నారు. నగరంలోని గొంటి వీధి పట్టణ నిరాశ్రయుల భవనం ఆవరణలో నిస్సహాయులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు సేవ చేసే భాగ్యం కలిగిందని, అందుకు క్లబ్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, క్లబ్ ఉపాధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, ఉర్లం శివతేజ, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, కార్యదర్శి టెక్కం రామ్ గోపాల్, పొడుగు చరణ్, చౌదరి శ్రీనివాస్, సైలాని, వీరభద్రం పాల్గొన్నారు.

నేడు మధుర గీతాలాపన

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో స్వరాత్మిక సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు ఎస్పీ బాలు సుమధుర గీతాలాపనలు జరుగుతాయని నిర్వాహకులు కె.వి.ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్యపరీక్షలు తప్పనిసరి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

శ్రీకాకుళం రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లిల్లీ అన్నారు. శుక్రవారం గూడెం గ్రామంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ తదితర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చంపాగల్లి వీధికి చెందిన కంచి కామాక్షిదేవి స్వర్ణకార సంఘం, జిల్లా స్వర్ణకార సంఘం, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలలో భాగంగా మూడో రోజు శుక్రవారం సహస్ర దీపారాధన ఘనంగా నిర్వహించారు. మహిళలంతా దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం



రిటైర్డ్ టీచర్లను సత్కరించిన దృశ్యం

జి.సిగడాం: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సంతవురిటి గ్రామంలో శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయులు వి.వి.గోపాలపాత్రో, వి.వి.కె.జగన్నాథరావు పట్నాయక్, వి.వనమాలి ప్రసాద్, బి.కృష్ణారావు, సీహెచ్‌ఆర్‌కే రంగారావు, పాసపు సత్యారావు, వి.వి.వి.ఉమాశంకర్‌లను ఘనంగా సన్మానించారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తినాయుడు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, వజ్జిపత్తి రఘురాం, పండూరి అప్పారావు, బూరాడ వెంకటరమణ, ఎన్ని జనార్దనరావు, ముద్దాడ త్రినాదరావు, బొట్ల భాస్కరరావు, సత్యారావు పాల్గొన్నారు.

తీరని గాయం.. అందని సాయం!

- అగ్ని ప్రమాద బాధితులకు భరోసా కరువు
- మంజూరు కాని గృహాలు
- తక్షణ సాయమూ అందించని కూటమి పాలకులు



కాలిపోయిన ఇంటి వద్ద అగ్ని ప్రమాద బాధితుడు

జి.సిగడాం: వారంతా నిరుపేదలు. రెక్కల కష్టాన్ని నమ్ముకుంటూ పూరిగుడిసెల్లో తలదాచుకుండేవారు. అలాంటి వారంతా అగ్ని ప్రమాదం కారణంగా నిరాశ్రయులయ్యారు. సర్వస్వం బుగ్గిపాలు కావడంతో రోడ్డున పడ్డారు. కూటమి ప్రభుత్వం తక్షణ సాయంగానీ, పక్కా ఇళ్లు గానీ మంజూరు చేయకపోవడంతో వారంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామంలో గత ఏడాది నవంబర్ 23న జరిగిన అగ్ని ప్రమాదంలో తలే సంతోష్‌కుమారి, లండ లక్ష్మణ, కోడిగుడ్ల ఆదెమ్మ, కేతుబారిక సోములు, కేతుబారిక అసిరయ్య, కేతుబారిక దాలెమ్మ, కేతుబారిక శంకరరావు, కరజాడ ఈశ్వరరావు, కేతుబారిక దాలెప్పడుకు చెందిన పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆహారం, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. కష్టపడి దాచుకున్న సొమ్మంతా కాలిపోయింది. అందరికీ కలిపి సుమారు రూ.12 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. అప్పట్లో అధికారులు 10 కేజీల బియ్యం మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారు.

కనీస సాయమేదీ?

సాధారణంగా ఎవరైనా అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోతే బాధితులకు తక్షణ సాయంగా వంట సామగ్రి కోసం రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అగ్ని బాధితులకు ఎటువంటి సాయం అందడం లేదు. దీని కోసం నిధులు మంజూరు చేయడం లేదు. అప్పట్లో అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు వచ్చి బాధితులకు అన్ని విధాలా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అయినా నేటికీ ఎటువంటి సాయం అందలేదు.

పక్కా గృహాల కోసం ఎదురుచూపు..

అగ్నిబాధితులకు ప్రమాదం జరిగిన వారం రోజుల్లోనే పక్కా గృహాలు మంజూరు చేసేవారు. ఈ ప్రభుత్వంలో మాత్రం ఆ పరిస్థితి ఉండటం లేదు. ఇంతవరకు అగ్ని బాధితులకు పక్కా గృహాలు మంజూరు చేయలేదు. దీంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఇంటి నష్టం జరిగిందని ధ్రువపత్రాలు అందించినా ప్రభుత్వం మాత్రం పక్కా ఇళ్లు మంజూరు చేయడం లేదు.

వచ్చారు..వెళ్లారు..



ఇంటితో పాటు సర్వస్వం కోల్పోయాం. ప్రభుత్వం ఆర్థిక సాయం గానీ, వంటసామగ్రి గానీ ఇంతవరకు అందించలేదు. అధికారులు, నాయకులు వచ్చి వెళ్లిపోయారు తప్ప మమ్మల్ని ఆదుకోలేదు.

– కేతబారికి శంకరరావు, సంతవురిటి

బియ్యం మాత్రమే ఇచ్చారు..



అగ్నిప్రమాదం జరిగిన తర్వాత అధికారులు వచ్చి 10 కేజీల బియ్యం మాత్రమే అందించారు. ఎటువంటి ఆర్థిక సాయం అందించలేదు. పక్కా ఇళ్లు కూడా మంజూరు చేయలేదు.

– కేతుబారికి అసిరయ్య, సంతవురిటి

ప్రభుత్వం ఆదుకోవాలి



అగ్ని ప్రమాద బాధితులంతా ఎస్సీ కులానికి చెందిన నిరుపేదలు. వారికి ఎటువంటి ఆదాయం లేదు. కట్టుబట్టలతో బయటే ఉన్నారు. గ్రామస్తులు, యువత, ఇతరుల సహకారంతో దుస్తులు, సామగ్రి అందించారు. ప్రభుత్వం స్పందించి సాయం అందించాలి.

– బుడారి లక్ష్మణరావు, గ్రామ సర్పంచ్, సంతవురిటి

డీఏ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు మురళీకృష్ణ

రణస్థలం: ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ, ఎస్ఎల్ వంటి బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బి.రవికుమార్ తెలిపారు. రణస్థలం మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను మెంబర్‌షిప్ క్యాంపెయిన్‌లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే 35 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రణస్థలం పీఆర్‌టీయూ సభ్యులు ఎం.జె.విల్సన్ బాబు, స్టేట్ మహిళా అధ్యక్షురాలు కె.ఇందిరా, జనరల్ సెక్రటరీ బి.చిన్నం నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌జేఎస్ రాజు, జిల్లా కౌన్సిలర్లు వి.ఉమామహేశ్వరరావు, ఈ.శ్రీనివాసరావు, ఎస్.విజయదుర్గ, పి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజమే లక్ష్యం



రణస్థలం: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న పీఓ

రణస్థలం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ అభివృద్ధి సాధ్యమౌతుందని రణస్థలం ఐసీడీఎస్ పీవో కె.రూపలత అన్నారు. కోష్ట సెక్టార్‌లోని సీహెచ్ రాజాం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులతో పాటు శిశువులు, చిన్న పిల్లల ఆహారపు అలవాట్లను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమ, అంగన్‌వాడీ కార్యకర్త ఏ.అమ్మోజీ, ఏఎన్ఎం ఎస్.రమణి, ఆశా కార్యకర్త జె.తవిటమ్మ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలంతా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. శుక్రవారం మధుపాం, కప్పరాం గ్రామాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు. బాల్య వివాహాలతో బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. వీటికి అడ్డుకట్ట వేయాలన్నారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాగమణి, రమణమ్మ పాల్గొన్నారు.



జి.సిగడాం: మధుపాంలో పౌష్టికాహార పంపిణీ

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలాశాఖ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని తపాలాశాఖ సూపరింటెండెంట్ వండాన హరిబాబు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం ప్రధాన తపాలా కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకూ తపాలాశాఖ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలన్నారు. ఆ చెత్తను పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు అందజేయాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా క్లాత్, గన్నీ బ్యాగ్‌లకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ పి.రంగారావు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ ఎన్.భానోజీరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతిఒక్కరు ఆరోగ్యంపై ముఖ్యంగా మహిళలు మరింత శ్రద్ధ వహించాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు పేర్కొన్నారు. కళాశాల సెమినార్ హాల్‌లో శుక్రవారం రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సూర్యసునీత ఆధ్వర్యంలో గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. శ్రీకాకుళంలోని ఐవీఎఫ్ సెంటర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కె.మృదుల 'రోల్ ఆఫ్ జింక్, మెగ్నీషియం అండ్ ఐరన్ ఇన్ ఉమెన్ స్టూడెంట్స్' అనే అంశంపై ప్రసంగించారు. యూరిన్ ఇన్ఫెక్షన్, సర్వైవల్ క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గెస్ట్ లెక్చర్‌ను ఏర్పాటుచేసిన డాక్టర్ సూర్యసునీతను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.చిన్నారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో ఆర్డినేటర్ కె.మౌనిక, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, కెమిస్ట్రీ లెక్చరర్లు సీహెచ్ చాందిని, పి.కీర్తి, ఎస్.గీతాకుమారి, ఎం.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

22న నవ, యువ కవులకు వర్క్‌షాపు

శ్రీకాకుళం కల్చరల్: యువ రచయితల వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి నవ, యువ కవులకు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు యరవే ప్రతినిధులు తంగి ఎర్రమ్మ, పొట్నూరు మాలతి శుక్రవారం తెలిపారు.

జిల్లా స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో కవితా సాహితీ ప్రక్రియలపై తరగతులు జరుగుతాయని, ఆసక్తి గల వారు 986624822 నంబరుకు సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

గార: మండల కేంద్రం గార సమీపంలోని ఎత్తిపోతల పథకానికి విద్యుత్ కనెక్షన్లు వేస్తున్న నేపథ్యంలో గార, ఆరంగిపేట, కుమ్మరిపేట గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ పైడి యోగేశ్వరరావు కోరారు.

జి.సిగడాం: జి.సిగడాం, బాతువ విద్యుత్ ఉప కేంద్రాలలో లైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాతువ, జి.సిగడాం, చెట్టుపొదిలాం, గొబ్బూరు, నిద్దాం, ముషినివలస, డి.ఆర్.వలస, పున్నాం, ఎందువపేట, అద్వాన్నంపేట, చంద్రయ్యపేట, మధుపాం, వెలగాడ, దేవరవలస, ఎస్.పి.ఆర్.పురం, నడిమివలస, ఎందువ, గెద్దకంచరాం, జాడ, ఎందువపేట, జగన్నాథవలస, సేతుభీమవరం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈఈ పైడి దుర్గాప్రసాద్ తెలిపారు.

అరసవల్లి: 33/11 కె.వి. అరసవల్లి, 11 కె.వి. కలెక్టరేట్ ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. కొత్తపేట, కలెక్టరేట్, 80 ఫీట్ రోడ్డు, వాంబే కాలనీ, ఎల్‌బీఎస్ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



దేవీ ఆశ్రమంలో అమ్మవారికి అభిషేకాలు

ఎచ్చెర్ల : కుంచాల కుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీ దేవీను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీచక్రాల వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

సంతోషిమాత ఆలయంలో..

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో విశేష కుంకుమ పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

న్యాయం చేయాలి

శ్రీకాకుళం క్రైమ్ : తమ బిడ్డలకు సంబంధించి కజికిస్తాన్‌లో ఎంబీబీఎస్ ఫీజులు ఎగ్గొట్టిన హరీష్ గంగాధర్‌పై కేసు నమోదు చేసినా ఇంతవరకు న్యాయం జరగలేదని జిల్లాకేంద్రంలోని చినబొందిలీపురానికి చెందిన అన్నెపు నానాజీరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఎస్పీ గ్రీవెన్సులో ఫిర్యాదు చేసిన ఈయన డీఎస్పీ సీహెచ్.వివేకానందను కలిసి సమస్య విన్నవించుకున్నారు. తన బిడ్డతో సహా మొత్తం ఏడుగురు విద్యార్థులనుంచి దాదాపు రూ.కోటికి పైగా ఫీజులు హరీష్ ఎగ్గొట్టాడని.. ఈ విషయమై గతంలో ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు కేసు కట్టి అతనితో పాటు సహకరించిన మరో వ్యక్తికి 41–ఏ నోటీసు ఇచ్చి సరిపెట్టేశారని, ఇప్పటివరకు చార్జిషీటు నమోదుచేయకపోవడం దారుణమన్నారు. తమ ఆడబిడ్డకు ఫోన్ చేసి కేసు వాపసు తీసుకోకపోతే చంపుతామని హరీష్‌గంగాధర్, మరో వ్యక్తి బెదిరిస్తున్నారని.. న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా కోర్టు ఆదేశాలతోనే వారికి 41–ఏ నోటీసు ఇచ్చామని.. చట్టపరంగా తాము ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరుకావాలనే కోర్టు చెప్పిందని.. ఉన్నతాధికారుల సూచనలతో నాలుగైదు రోజుల్లో చార్జిషీటు వేస్తామని చెప్పారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, పార్టీ నాయకులు

శ్రీకాకుళం రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. సీఎం చంద్రబాబు నియంతృత్వ ధోరణి వీడాలన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పెదపాడులోని ధర్మాన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజ్ పోస్టర్‌ను యువనేత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలలు మంజూరైతే కూటమి పాలన వచ్చాక వాటిని చంద్రబాబునాయుడు బినామీలకు, కూటమి నేతలకు దొడ్డిదారిలో కట్టబెట్టడానికి ప్రభుత్వ పెద్దలు పూనుకున్నారని దుయ్యబట్టారు. రూ.వేల కోట్లు విలువైన కాలేజీలను పీపీపీ విధానంలో కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీనిని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్, రాష్ట్ర వెలమ కుల విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గేదేల పురుషోత్తం, పార్టీ నాయకులు రౌతు శంకరావు, చిట్టి రవికుమార్, గంగు నరేంద్రకుమార్, బోర నర్సునాయుడు, గుండ హరేష్, పృథ్వీ, వాసు, బాణశ్రీను, ఓటుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో కార్మికులు.. అరచేతిలో ప్రాణాలు!



విద్యుత్ టవర్లపై పని చేస్తున్న కార్మికులు

రణస్థలం సమీపంలో విద్యుత్ లైన్ ఏర్పాటులో భాగంగా కార్మికులు అత్యంత పొడవైన టవర్లపైకి ఎక్కి పనిచేస్తున్నారు. ఎటువంటి భద్రత లేకుండా కనీసం రోప్ సహాయం తీసుకోకుండా పని చేయడం చూసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ఏమాత్రం పట్టు జారినా పెను ప్రమాదం తప్పదని, అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - రణస్థలం



టవర్ అంచున కార్మికులు

నిరక్షరాస్యత నిర్మూలనే ఉల్లాస్ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార: నిరక్షరాసులకు విద్య నేర్పించడమే ఉల్లాస్ లక్ష్యమని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. గార మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెండు రోజుల పాటు ఉల్లాస్ వలంటీర్ల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. వయోజనులకు అందించే శిక్షణకు సులువైన పద్ధతులపై వలంటీర్లు అవగాహన పెంచుకోవాలన్నారు. గార మండలంలో 25 పంచాయతీల్లో 3850 మంది వయోజనులను గుర్తించామని, వీరిలో పది మందికి ఒక వలంటీరు చొప్పున శిక్షణ ఇస్తారని చెప్పారు. పురుషులకు ఉపాధి సిబ్బంది, మహిళలకు వెలుగు సిబ్బంది శిక్షణ ఇస్తారని ఎంపీడీవో రఘు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్యారాణి, ఏపీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు లావేరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రణస్థలం: జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు జె.సుదర్శనం తెలిపారు. అండర్–17, అండర్–14 విభాగాల కబడ్డీ పోటీల్లో ఎ.జీవిత, కె.శిరీష, ఎం.రోహిత్, వాలీబాల్ పోటీలో వై.మహేష్, బి.హేమంత్ కుమార్, అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్ త్రోలో ఏ.భానుప్రసాద్, హైజంప్‌లో ఎడ్ల మహేష్, జావెలిన్ త్రోలో ఎ.జీవిత, 400 మీటర్ల పరుగులో బి.తనూజ, వై.సుస్వంత్, హేమర్ త్రోలో డి.హేమంత్‌కుమార్, ఎల్.చైతన్య, ఎస్.గోవిందలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వీరిని ఉపాధ్యాయులు పి.జగన్నాథం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లంకలపల్లి రాంబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తోటయ్య దొర, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు పిసిని వసంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్గిల్ పార్కు సుందరీకరణకు కృషి



పార్కును పరిశీలిస్తున్న కేంద్రమంత్రి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో కార్గిల్ పార్క్‌ను శుక్రవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్కు నిర్వహణ సక్రమంగా లేదని,చిల్డ్రన్ పార్క్ రీడింగ్ రూమ్, వాకింగ్ ట్రాక్ నిరుపయోగంగా మారాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక నీరు నిలిచిపోతోందని, చిన్నారులు ఆడుకోవడానికి అనువుగా లేదని చెప్పారు. అనంతరం మంత్రి స్పందిస్తూ పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సుడా నిధులతో బ్యూటిఫికేషన్, చిల్డ్రన్ పార్క్, రీడింగ్ రూమ్, కార్గిల్ థీమ్, జవాన్ బొమ్మలతో కూడిన విగ్రహాలను నెలకొల్పాలని అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లో డిజైన్లు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, నాయకులు అరవల రవీంద్ర, కొర్ను నాగార్జున ప్రతాప్, దుంగ భాస్కర్, బస్వా నాని పాల్గొన్నారు.

21న గురజాడ జయంతి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్ : తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 8 గంటలకు గురజాడ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెరవే అధ్యక్ష కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి శుక్రవారం తెలిపారు. ప్రశాంతినగర్ కాలనీలోని గాంధీస్మారక మందిర ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో సభ్యులంతా పాల్గొనాలని కోరారు.